క్లుప్తంగా

లోక కల్యాణం కోసం గాయత్రీ మహాయజ్ఞం

కారంచేడు: లోక కల్యాణం కోసం గ్రామంలో గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు యజ్ఞ నిర్వాహక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన కారంచేడు కాలువ సెంటర్‌లోని అభయాంజనేయస్వామి వారి విగ్రహం వద్ద ఈ నెల 18వ తేదీన 24 కుండముల మహా యజ్ఞమును నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 72 మంది దంపతులచే నిర్వహించనున్నామన్నారు.

చలివేంద్రం ప్రారంభం



స్వర్ణ గ్రామంలో మజ్జిగను అందిస్తున్న ఎంపీడీఓ

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీడీఓ కె. నేతాజీ చలివేంద్రం ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే లబ్ధిదారులు, వృద్ధులు, చిన్నపిల్లలకు వడదెబ్బలు తగలకుండా ఉండేందుకు వసరమైన తాగునీటిని అందించాలనే సంకల్పంతో ఈ చలివేంద్రను ఏర్పాటు చేయించామన్నారు. సర్పంచ్ మోటాని మధుసూదనరావు, గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది



బీరువాలు, మైక్ సెట్‌ను అందజేస్తున్న దాత

యద్దనపూడి: తనకు అక్షర భిక్ష పెట్టి తమ ఉన్నతికి తోడ్పడిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేస్తున్న సాయం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు ఏఎం. శ్రీనివాసరావు అన్నారు. పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి రాటకొండ వరదబాబు వారి తల్లిదండ్రులైన సాంబయ్య, వెంకాయమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.50 వేలు విలువైన మైక్ మరియు సౌండ్ సిస్టం, రెండు బీరువాలు పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా దాత వరదబాబు దంపతులను పాఠశాల సిబ్బంది , గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు దీవి భావనాచార్యులు, దరువూరి వీరయ్య, రాటకొండ కోటేశ్వరరావు, బాబు, జెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైదనలో మహిళపై దాడి

బల్లికురవ: ఆస్తుల పంపకం విషయంలో మహిళపై దాయాదులు దాడి చేయగా మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. మండలంలోని వైదన గ్రామానికి చెందిన ఓర్సు రమణమ్మ పై ఓర్సు వెంకటేశ్వర్లు మరో ముగ్గురు సోమవారం దాడిచేయగా క్షతగాత్రురాలిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నేటి నుంచి టైలరింగ్ శిక్షణ

అద్దంకి: పట్టణంలోని సంజీవన గర్ సచివాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శింగయ్య మంగళవారం తెలిపారు. మొదటి విడతగా 144 మందికి రెండు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమం 90 రోజుల పాటు సాగుతుందని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ భుక్యా శాంతి బాయి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని అన్ని శాఖలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మట్టి ఘుమఘుమలు.. ఆరోగ్య సంపదలు!



భూదేవి..
సకల జీవాలను కాపాడే దేవి
భూమాత.. సకల వృత్తుల వారికి చేయూత
మట్టి కుండ అంటే సాక్షాత్తు భూదేవిని
ముద్దాడటమే!
అందులో తాగే నీరు ఆరోగ్యాన్నే కాదు
ఆధ్యాత్మికతనూ పంచుతుందనటంలో
ఎలాంటి సందేహం లేదు

- కుండలకు గిరాకీ
- ఎండల తీవ్రత దృష్ట్యా కొనేందుకు మొగ్గు చూపుతున్న ప్రజలు
- ఒక్కో కుండ రూ. 200 నుంచి రూ. 250

వేటపాలెం: ఏప్రిల్ నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. పిల్లలు, వృద్ధులైతే ఉక్కపోత భరించలేక అల్లాడిపోతున్నారు. ఇప్పటికే 38 నుంచి 39 డిగ్రీల వరకు ఎండల తీవ్రత పెరిగిపోయింది. ఉక్కపోత కూడా తోడవడంతో ప్రజలకు ఊపిరి ఆడటం లేదు. అలాగే ఎంత నీరు తాగినే దాహం తీరే పరిస్థితి లేకపోవడంతో పేదవాడి ఫ్రిజ్‌గా అనుకొనే మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. పేద, మధ్యతరగతి వర్గాల వారు, ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవారు చల్లటి నీటి కోసం మట్టి కుండలను ఆశ్రయిస్తున్నారు. ఎక్కువ శాతం మంది ఇప్పటివరకు ఫ్రిజ్ నీళ్లకే అలవాటు పడినప్పటికీ వేసవిలో రాగానే ప్రతి ఒక్కరూ కుండలో నీరు తాగాలని తాపత్రయ పడటం మంచి పరిణామం. పలు పనులపై బయటకు వెళ్లి ఇంటికి చేరగానే కుండలో నీటితో సేద తీరుతున్నారు. మరికొంతమంది ఇళ్లల్లో ఫ్రిజ్ ఉన్నప్పటికీ కుండలను కొనుగోలు చేస్తుండటం గమనార్హం. మట్టి కుండల సైజును బట్టి రూ. 200 నుంచి 250 వరకు విక్రయిస్తున్నారు. వేసవిలో వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.



విక్రయానికి ఉంచిన మట్టి కుండలు

ఇప్పటికీ మట్టి కుండపై మక్కువే..

రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోతుండటంతో.. ఎన్నో రకాల పనిముట్లు, వస్తు సామగ్రి కూడా నవీన పోకడలతో తయారవుతున్నాయి. ఇదే క్రమంలో మట్టి పాత్రలకు బదులు అల్యూమినియం, స్టీలు ఇతర హానికర కెమికల్స్‌తో తయారయ్యే పాన్‌ల వంటి వాటిని వాడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కుమ్మరి పని చేసేవారు కూడా కానరావడంలేదు. కుక్కర్లు, ఇండక్షన్ స్టౌలు, మైక్రో ఓవెన్ల వంటి వాటితోనే వంట చేస్తున్నారు. వీటిని వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నా ఎవరూ తగ్గడంలేదు. ఇలాంటి నేపథ్యంలో మట్టి కుండలకు మాత్రం ఏమాత్రం క్రేజ్ తగ్గకపోవడం గమనార్హం. ప్రస్తుతం సోషల్ మీడియాలో పాత తరం వారు తినే ఆహారపదార్థాలు, వస్తువుల గురించి తీవ్ర చర్చలు జరుగుతుండటంతో పలువురిలో ఆహార అలవాట్లు కూడా మార్చుకుంటుండటం శుభపరిణామమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు కాకున్నా..

ప్రస్తుతం కుండల ధరలు బాగానే ఉన్నా.. వాటిని తయారు చేసేందుకు ఖర్చు ఎక్కువగా అవుతోందని కుమ్మర వృత్తి దారులు చెబుతున్నారు. కుండలు తయారు చేసేందుకు కుటుంబమంతా కష్టపడాలని పేర్కొన్నారు. అయినా చేసిన పనికి ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం కులవృత్తుల పై ఆధారపడే వారికి ఉపాధితో పాటు సబ్సిడీ కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయం మిన్న



కారంచేడులో శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న డీపీఎం వాణిశ్రీ

కారంచేడు: ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పై ప్రత్యేక దృష్టి పెడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతన్నలకు ప్రోత్సాహకరంగా ఉంటామని బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు అధికారి (డీపీఎం) వి. వాణిశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కారంచేడు వెలుగు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతిలో మాట్లాడారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్ 2025 ఆర్థిక సంవత్సర మండల స్థాయి శిక్షణ తరగతిలో ఆమె ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలచిన బి. వెంకటేశ్వర్లు, చిట్టెమ్మలను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతు ప్రకృతి వ్యవసాయం వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రసాయన ఎరువులతో చేసే వ్యవసాయంతో వచ్చిన పంటల వలన అనారోగ్యాలు తప్పవన్నారు. తమ సొంత భూముల్లో రైతులు కొంత మేర అయినా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన అన్ని రకాల కషాయాలను సైతం రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. మోహనరావు, వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు, డి. భీమరాజు, బీవీ శ్రీనివాసరావు, మార్కెటింగ్, వ్యవసాయ, వీఏఏలు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, రైతులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.



జె.పంగులూరు: ప్రకృతి వ్యవసాయం గురించి తెలియ జేస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

జె.పంగులూరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు వస్తాయని వ్యవసాయ అడిషినల్ డీపీఎం జె. మోహన్, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యసాయ వార్షిక ప్రణాళిక తయారు చేయు విధివిధానాలపై వ్యవసాయ శాఖ, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి పురుగు మందు అవశేషాలు లేని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినవచ్చని తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఏపీఎం ప్రసాద్‌బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల సమైఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇడుపులపాడు పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇంకొల్లు(చినగంజాం): ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో 31 సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. పాఠశాలలో 1993–94లో 10వ తరగతి పూర్తి చేసుకొని వివిధ రంగాల్లో స్థిర పడిన 45 మంది అప్పటి విద్యార్థులు 31 ఏళ్ల తరువాత మంగళవారం పాఠశాల ఆవరణలో కలుసుకొని తమ ఆనందాలను పంచుకున్నారు. ఇంత కాలం తరువాత వారంతా ముందుగా తమ గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ 31 సంవత్సరాలు తరువాత కలుసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, అంతా తమ అనుభూతులను గుర్తు చేసుకోవడానికి చాలా మంచి అవకాశం కలిగిందన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సహకారం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులను సన్మానించడం వారిలో కూడా మానసిక ఉల్లాసాన్ని నింపుతుందన్నారు. కుటుంబ బంధం కంటే స్నేహ బంధం గొప్పదని స్నేహబంధం మనోధైర్యానికి తోడ్పడుతుందని తెలిపారు. పాఠశాలలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు దండా లక్ష్మీనారాయణ, బత్తుల కోటేశ్వరరావు, నారాయణ మురళీధర్, తోటకూర లక్ష్మీ సుబ్బారావు, అమ్మనమంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలునికి ఆర్థిక సాయం



బాలుని తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

అద్దంకి: ప్రకాశం జిల్లా వుల్లగల్లు గ్రమానికి చెందిన తప్పెట యాయిత్య అనే విద్యార్థి మూడు సంవత్సరాల నుంచి కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పదో తరగతి 1988–89 బ్యాంచ్ దృష్టికి రాగా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. మంగళవారం బాలుని తండ్రిని అద్దంకి పట్టణానికి పిలిపించి రూ. 70వేలు ఆర్థిక సాయం అందించారు. సంఘ ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, పురషోత్తం, ధర్మవరపు వెంకట్రావు, గొర్లపాటి మురళీ కృష్ణ, కొత్త శ్రీమన్నారాయణ, ఘంటసాల శ్రీనివాసరావు, బెల్లం రాజేశ్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జవ్వాజి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న టంగుటూరి ప్రకాశం

అద్దంకి: బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా పట్టణానికి చెందిన టంగుటూరి ప్రకాశం మంగళశారం ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు పట్టణంలోని అంబికా ఫంక్షన్ హాలులో కార్యక్రమం నిర్వహించారని.. రాష్ట్రం నలుమూలల నుంచి బ్రాహ్మణ పెద్దలు, సంఘ నాయకులు హాజరైనట్లు ప్రకాశం తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



నూతనంగా ఎన్నికైన చీరాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాల రూరల్: చీరాల బార్ అసోసియేషన్‌కు సంబంధించిన ఎన్నికలు మంగళవారం రాత్రితో ప్రశాంతంగా ముగిశాయి. పదిరోజులు పాటు హోరాహోరీగా అభ్యర్థులు ఇంటింటా ప్రచారం చేసి న్యాయవాదులను ఓట్లు అభ్యర్థించారు. కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. మొత్తం 201 ఓట్లకు గాను 190 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి పోటీపడిన కొమ్మన బోయిన నాగేశ్వరరావు, గౌరవ రమేష్‌బాబుల కౌంటింగ్ ప్రక్రియ నువ్వానేనా అన్నంతగా ఉత్కంఠంగా కొనసాగింది. చివరి వరకు ఇద్దరికి సమానంగా ఓట్లు పోలయ్యాయి. నాగేశ్వరరావుకు 93 ఓట్లు పోలవ్వగా రమేష్‌బాబుకు 97 ఓట్లు వచ్చాయి వాటిలో ఒక నోటా, ఒకటి నిల్‌గా వచ్చింది. దీంతో రమేష్‌బాబు నాలుగు ఓట్ల ఆదిక్యంతో గెలుపొందాడు. మూడవ సారి విజయం సాధించిన రమేష్ బాబు హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకున్నాడు. ఉపాధ్యక్ష పదవి కోసం పోటీపడిన తారక రామారావుకు 64 ఓట్లు రాగా బండ్లమూడి విజయ కుమార్‌కు 121 ఓట్లు పోలవడంతో అత్యధిక మెజార్టీతో విజయం సాధించాడు. జనరల్ సెక్రటరీ పదవికోసం మంకెన అశోక్‌కుమార్, మేరుగు రవి కుమార్‌లు పోటీపడగా అశోక్‌కుమార్‌కు 86 ఓట్లు రాగా రవికుమార్‌కు 99 ఓట్లు పోలవడంతో విజేతగా నిలిచాడు. ట్రెజరర్‌గా ఎం. రామకృష్ణపై నాశన రామకోటేశ్వరరావు 114 ఓట్లు సాధించి విజయం సాధించాడు. లైబ్రరీ సెక్రటరీగా సిరిపురపు కామేశ్వరరావు ఎ. కల్పనపై 126 ఓట్లు సాధించి విజయాన్నందుకున్నాడు. మహిళా ప్రతినిధిగా స్నేహ, జాయింగ్ సెక్రటరీగా మస్తాన్‌వలి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎ. రాజా సువి సాల్మన్‌లను ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ఎన్నికల అధికారిగా కరేటి రవికుమార్ రెడ్డి, సహాయ ఎన్నికల అధికారులుగా ఆసాది సత్యనారాయణ రెడ్డి, బోయిన రమేష్‌బాబు, అందే వెంకటేశ్వరరావు, విష్ణువరప్రసాద్ వ్యవహరించారు. కొత్తగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులను తోటి న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకోండి



గన్నవరంలో క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

యద్దనపూడి: క్షయ వ్యాధి పట్ల జాగ్రత్తలు పాటిస్తే పూర్తిగా నయం చేయవచ్చని యద్దనపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష సూచించారు. మంగళవారం గన్నవరం, పూనూరు గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు.. వారితో దగ్గర సంబంధం కలిగిన వ్యక్తులకు సీవై టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా కలిగే అంటువ్యాధి అన్నారు. ఈ వ్యాధి వల్ల దగ్గు, జ్వరం, బరువు తగ్గటం ఆకలి మందగించటం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. దీని నివారణకు దగ్గరలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తారని, నిర్ధారణ అయిన వారికి ఆరునెలల వరకు మందులు వాడితే క్షయను పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. మార్టూరు టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ బి. రాజశేఖర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కమ్యూనిటీ ఆఫీసర్ తంగిళ్ల విజయచంద్ర శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్స్ నాగేశ్వరావు, సునంద, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

లాక్రోస్‌లో ప్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ సత్తా



ఏపీ లాక్రోస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

చీరాల: ఏపీ లాక్రోస్ గేమ్ (నేషనల్) ఈనెల 29, 30న ఆగ్రాలో జరగనున్న నేపథ్యంలో ఈనెల 13,14 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలోని ప్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి 11 జిల్లాల నుంచి 350 మంది పాల్గొన్నారు. నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ టీంలు ముందుంజలో ఉండి అన్ని కేటగిరీల్లో గోల్డ్ మెడల్స్ సాధించాయని స్కూల్ ప్రిన్సిపాల్ బి.అశోక్‌బాబు తెలిపారు. లాక్రోస్ గేమ్‌లో 12 మంది క్రీడాకారులుండగా సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో 9 మంది, సబ్ జూనియర్ గరల్స్‌లో పది మంది, సీనియర్ బాయ్స్‌లో పది మంది, జూనియర్ గరల్స్‌లో 9మంది, సీనియర్ బాయ్స్‌లో పది మంది ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఏపీ లాక్రోస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.మునికృష్ణయ్య, జనరల్ సెక్రటరీ ఎం.సురేంద్రరెడ్డి, జ్యోత్స్న దేవి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

సంపద కేంద్రాలతో ఆదాయం



వైదనలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

బల్లికురవ: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా ఆదాయ వనరులు పెంచుకోవచ్చని డీఎల్‌పీఓ శివన్నారాయణ అన్నారు. వైదనలోని చెత్తనుంచి సంపద కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. సంవత్సరాలు గడుస్తున్న మండలంలోని 7 గ్రామ పంచాయతీలో ఇంకా సంపద కేంద్రాల నిర్మాణాలు చేపట్టకపోవటం, పూర్తి కాకపోవటం పట్ల అసహనం వ్యక్తంచేశారు. బాధ్యతలు గుర్తెరిగి పని చేయాలని కోరారు. సర్పంచ్ బండారు వెంకాయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ దాసరి సుమతి పాల్గొన్నారు.

1000 రోజుల సంరక్షణలో తల్లీ బిడ్డ క్షేమం


మార్టూరు: అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలో 1000 రోజుల సంరక్షణలో తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ద్రోణాదుల సెక్టార్ సూపర్ వైజర్ కె. పద్మ అన్నారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని ద్రోణాదుల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక మహిళలతో మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయుడు కె. విద్యా సాగర్, ఏఎన్ఎం కోటేశ్వరి, మహిళా సంరక్షకురాలు ప్రత్యూష, అంగన్‌వాడీ కార్యకర్తలు అచ్చయమ్మ, అంకమ్మ, రాణి, పద్మ, పాల కుమారి, సునీత పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం మార్టూరు సచివాలయం ఒకటిలో మార్టూరు సెక్టార్ సూపర్ వైజర్ టి. శిరీష ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై కార్యకర్తలు పీవీ సుశీల, ఎస్. అరుణ కుమారి, దయమ్మ, రాజ్యం, జ్యోతి స్థానిక మహిళలు పాల్గొన్నారు.


కారంచేడు: గర్భిణులు గర్భస్థ దశ నుంచి చాలా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ కారంచేడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ హిమబిందు అన్నారు. మంగళవారం కారంచేడులో పలు సూచనలు చేశారు. శ్రీలక్ష్మి, నాగూర్‌బీ, రాధ పాల్గొన్నారు.

బల్లికురవ: గర్భిణులు ఆరోగ్య పరీక్షలతో పౌష్టిహారం తీసుకోవాలని పాత మల్లాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. ప్రభాకరరావు అన్నారు. మంగళవారం సూపర్‌వైజర్ షేక్ మీరాబీ మాట్లాడారు. కార్యకర్తలు నాగమణి, సత్యవతి, రత్నకుమారి, భారతి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు దూరం



అగ్ని ప్రమాదాలపై ప్రజలకు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అద్దంకి: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చీరాల అర్బన్: సరైన జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి రామకృష్ణ అన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని వెంటనే నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, ఎంజీసీ మార్కెట్, తదితర జనసంచార ప్రాంతాల్లోని ప్రజలు, కార్మికులు, ఉద్యోగులకు అగ్నిమాపక సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నినిరోధకాల ద్వారా వాటిని ఏ విధంగా నియంత్రించాలనేది కరపత్రాల ద్వారా వివరించారు. చెత్త కుప్పలు, ఇతర జనసంచార ప్రాంతాల్లో బీడీలు, సిగరెట్లు ఆర్పకుండా పడేయడం, మంటలు వ్యాప్తించకుండా తీసుకునే చర్యలను వివరించారు. అలానే ఇళ్లలో తరచుగా గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు వ్యాపిస్తుంటాయని, అటువంటి సందర్భాల్లో గ్యాస్ సిలిండర్‌ను ఆపివేయడాన్ని వివరించారు.

అద్దంకి: అప్రమత్తతో అగ్నిప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని అగ్నిమాపక కేంద్ర అధికారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బస్టాండు ఆవరణలో అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వివిధరాకాల మంటలను ఎలా ఆర్పాలో తెలియజేశారు.

అర్జీల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి డీటీ ప్రసన్న, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

పర్చూరు (చిన్నగంజాం): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పర్చూరు ఎంపీపీ మేకా ఆనంద కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మాట్లాడుతూ వేసవిలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తామని చెప్పారు. 'మన మిత్ర యాప్' పై అందరికీ అవగాహన కల్పించాలని ఈఓపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ రెడ్డి, చెరుకూరు డాక్టర్ బాబు, ఏపీవో రమేష్ పాల్గొన్నారు.

స్థలాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

వేటపాలెం: గత ప్రభుత్వ లేఅవుట్‌లోని కాలనీల్లో పొందిన నివేశన స్థలాల సర్వే పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ పార్వతి ఆదేశించారు. వీఆర్ఓలు, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. మొదటగా చల్లా రెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని దత్తక్షేత్రం కాలనీ, కొణిజేటి చేనేతపురి కాలనీ, బచ్చులవారిపాలెం రోడ్డులో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో లబ్ధిదారుల పేరు పైనే ఉన్నాయా లేదా వారు విక్రయించారా పరిశీలిస్తామని తెలిపారు.